సాక్షి
కామారెడ్డి

సోమవారం ౹ 6 ౹ మే ౹ 2024



లక్షకుపైగా మెజారిటీతో..

జహీరాబాద్‌లో లక్షకుపైగా మెజారిటీతో బీజేపీ అభ్యర్థి గెలవడం ఖాయమని కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ పేర్కొన్నారు.

- IIలో ▸



కాంగ్రెస్‌తోనే లబ్ధి

కాంగ్రెస్‌తోనే ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే పేర్కొన్నారు.

- IIIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
45.9 /20.8

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. వాతావరణం పొడిగా మారుతుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి'



గాంధారి: ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఆదివారం గుర్జల్, బ్రాహ్మణపల్లి, గాంధారిలలోని కొనుగోలు కేంద్రాలను, గాంధారిలోని రైస్ మిల్లును సందర్శించారు. రైతులకు నీడ, మంచినీటి వసతి కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మూడు రోజులలో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున కేంద్రాల నిర్వాహకులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి పొద్దుపోయాక కూడా ధాన్యం కొనుగోలు చేసి, ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలన్నారు. 2023–24 ఖరీఫ్‌కు సంబంధించిన సీఎంఆర్‌ను గడువులోగా ఎఫ్‌సీఐకి అప్పగించాలని మిల్లర్లకు సూచించారు.

'ఓటింగ్ శాతం పెంచాలి'



కామారెడ్డి క్రైం : ఓటింగ్ శాతం పెంచడానికి కృషి చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు గోపాల్ జీ తివారి అధికారులకు సూచించారు. కామారెడ్డిలోని ఆదర్శనగర్, దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన సందర్శించారు. వసతులను పరిశీలించారు. బూత్ లెవల్ అధికారులతో మాట్లాడి ఓటర్ల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఆర్డీవో రఘునాథరావు, నోడల్ అధికారి రఘునాథ్, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూం పరిశీలన

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని జీవదాన్ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూంను ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ జీ తివారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూం వద్ద ఏర్పాటు చేసిన భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర వివరాలను పరిశీలించారు. వారి వెంట ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్ కుమార్ ఉన్నారు.

బ్లడ్‌డోనర్స్ గ్రూప్ సేవలు అభినందనీయం

- హైదరాబాద్ రేంజ్(జైళ్లు) డీఐజీ శ్రీనివాస్



కామారెడ్డి అర్బన్ : తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం కామారెడ్డి రక్తదాతల సమూహం ద్వారా ఏడాది కాలంలో 2,306 యూనిట్ల రక్తం సేకరించి, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కావడం అభినందనీయమని హైదరాబాద్ రేంజ్ (జైళ్లు) డీఐజీ దుద్దెల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా ఆదివారం స్థానిక కర్షక్ బీఈడీ కళాశాలలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి డీఐజీ దుద్దెల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో 82 మంది రక్తదాతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకులుగా డాక్టర్ బాలు 2007 నుంచి 20 వేల యూనిట్ల రక్తం సేకరించడం సామాన్య విషయం కాదన్నారు. యువతను చైతన్యం చేస్తూ రక్తదానంపై అవగాహన కల్పించడం ద్వారా కామారెడ్డి రక్తదాతలు కృషి అసామాన్యమైన కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రక్తదాతల సమూహం, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు చింతల లక్ష్మీపతి, డాక్టర్ వేద ప్రకాష్, పుట్ట అనిల్‌కుమార్, జమీల్ అహ్మద్, ఎర్రం చంద్రశేఖర్, వెంకటరమణ, కిరణ్, శ్రీకాంత్‌రెడ్డి, రంగ కిషన్, ఎం జైపాల్‌రెడ్డి, నవీన్, నరేందర్ పాల్గొన్నారు.



నగరంలోని గిరిరాజ్ కాలేజీ మైదానంలో నిర్వహించిన బీజేపీ సభకు హాజరైన ప్రజలు

అభివాదం చేస్తున్న అమిత్ షా

ఇందూరులోనే పసుపు బోర్డు

- చక్కెర ఫ్యాక్టరీలు మూతపడడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్‌లే కారణం
- రిజర్వేషన్ల రద్దుపై సీఎం రేవంత్‌రెడ్డిది అసత్య ప్రచారం
- విశాల జనసభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

సుభాష్‌నగర్: ఇందూరు కేంద్రంగానే పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ఏర్పాటు కానుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. పసుపు రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు కోసం ప్రధాని మోదీ వెంట పడి సాధించారన్నారు. వెంటనే గెజిట్ కూడా వచ్చిందన్నారు. నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిగా, అర్వింద్‌ను రెండోసారి ఎంపీగా గెలిపిస్తే బోర్డు ఏర్పాటు చేయడం ఖాయమని స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో బీజేపీ నిర్వహించిన ఇందూరు విశాల జనసభలో అమిత్ షా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయాలు నవనాథ సిద్ధుల గుట్ట, కందకుర్తి త్రివేణి సంగమం, డిచ్‌పల్లి రామాలయం, బాసర సరస్వతి అమ్మవారికి నమస్కరించి ఆయన ప్రసంగాన్ని ప్రారంభించారు.

■ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో చెరుకు ఫ్యాక్టరీలు మూత పడటానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ కారణమని అమిత్ షా విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, చక్కెర కర్మాగారాలు తెరిపించాలన్నారు. మే 13న నియోజకవర్గ ప్రజలందరూ అర్వింద్ గెలుపు కోసం కమలం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. దేశంలో బీజేపీ 80 కోట్ల మంది ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని అర్హులకు చేరవేయడంలో అర్వింద్ మొదటి స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. మరోసారి ఆయనను గెలిపిస్తే నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరుగుతుందని, పేద ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.



మాట్లాడుతున్న అమిత్ షా, పక్కన అర్వింద్

■ రిజర్వేషన్లపై సీఎం రేవంత్‌రెడ్డి ఫేక్ వీడియోను సృష్టించి ప్రచారం చేశారని, తన వ్యాఖ్యలు వక్రీకరించి దుష్ప్రచారం చేశారని అమిత్ షా పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో అలా చేస్తే ఏం జరుగుతుందో రేవంత్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. రాముడు, హనుమంతుడి శోభాయాత్రకు కూడా ఆంక్షలు పెట్టే పరిస్థితి తెలంగాణలో ఉందన్నారు. తెలంగాణ విమోచన దినం నిర్వహించరని అన్నారు. ముస్లిం మహిళల ఆత్మగౌరవం కోసం త్రిపుల్ తలాక్‌ను మోదీ రద్దు చేస్తే.. కాంగ్రెస్ దాన్ని తీసుకువస్తానని ప్రకటించిందని విమర్శించారు.

బీడీ కార్మికుల కోసం ఆస్పత్రి...

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అధికంగా ఉన్న బీడీ కార్మికుల సంక్షేమం కోసం 500 పడకల ఆస్పత్రి నిర్మిస్తామని అమిత్ షా ప్రకటించారు. 70 ఏళ్ల కాంగ్రెస్ హయాంలో అయోధ్యలో రామ మందిర నిర్మాణం చేపట్టలేదన్నారు. మోదీ ఐదేళ్లలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ట చేశారని గుర్తు చేశారు. రామ జన్మభూమి లో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులను ఆహ్వానించినా ఓవైసీకి భయపడి ఆ పార్టీ నాయకులు హాజరు కాలేదని విమర్శించారు. నిజామాబాద్‌లో వెలుగు చూసిన పీఎఫ్ఐ మూలాలను కూకటి వేళ్లతో పెకిలించి వేశామన్నారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని, దీనిని గమనిస్తున్న ప్రజలు ఓటుతోనే బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాన మంత్రి అయితే దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో మూడో స్థానానికి చేరుకోవడం ఖాయమని పేర్కొన్నారు.


మోదీ ఉన్నంత వరకు రిజర్వేషన్లు కొనసాగుతాయి

తాను బతికున్నంత వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కొనసాగిస్తామని ఇటీవల నరేంద్రమోదీ ప్రకటించారని ఎంపీ, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. ముస్లింల రిజర్వేషన్లు తీసేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెంచుతామన్నారని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలపైనుంచి దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్ నాయకులు బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మోదీ ఉన్నంతవరకు రిజర్వేషన్లు రద్దు చేయరని, సీఎంగా రేవంత్‌రెడ్డి ఉన్నంత కాలం ఆరు గ్యారంటీలు అమలు కావని ఎద్దేవా చేశారు. సీఏఏ, ఎన్ఆర్‌సీ, యూనిఫాం సివిల్ కోడ్‌పై జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ స్టాండ్ చెప్పాలని డిమాండ్ చేశారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తయ్యిందని, త్వరలోనే మధురలో శ్రీకృష్ణుడి మందిరం నిర్మిస్తామని పేర్కొన్నారు. ఓట్ల కోసం ముస్లింలను ఎన్ని రోజులు మోస్తారని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు.



వేదికపైన ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ నేతలు

ముగిసిన హోం ఓటింగ్



కామారెడ్డిలో ఓటు వేస్తున్న వృద్ధుడు



పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసిన ఉద్యోగులు

కామారెడ్డి క్రైం: జిల్లాలో రెండు రోజుల పాటు కొనసాగిన హోం ఓటింగ్ ఆదివారం ముగిసింది. 85 ఏళ్ల పైబడిన వృద్ధులతోపాటు దివ్యాంగులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటివద్దే వినియోగించుకున్నారు. ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారి, మైక్రో అబ్జర్వర్, పోలీస్ కానిస్టేబుల్‌తో కూడిన బృందం ఓటర్ల ఇంటికి వెళ్లి గోప్యంగా ఓటు నమోదు చేయించారు. కార్యక్రమాన్ని వీడియోగ్రఫీ చేయించినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్..

ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలీసు అధికారులు పలువురు ఆదివారం రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాకు చెందిన 4,546 మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, పోలీస్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కోసం దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. వీరికోసం కామారెడ్డి ఆర్డీవో కార్యాలయంతోపాటు మద్నూరు, ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయాల్లో ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. శని, ఆదివారాలలో పీవోలు, ఏపీవోలు, పోలీసు అధికారులు ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఇతర పోలింగ్ సిబ్బంది సోమ, మంగళ వారాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే కుల వృత్తులకు మహర్దశ

భిక్కనూరు: కాంగ్రెస్ పాలనలో కుల వృత్తులకు మహర్దశ కలుగుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ఆదివారం భిక్కనూరు స్వర్ణకార సంఘం ప్రతినిధులతోపాటు జంగంపల్లి, భిక్కనూరు, కాచాపూర్, తిప్పాపూర్‌లకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు ప్రజలను తమవైపు తిప్పుకునేందుకు కామారెడ్డి జిల్లాను రద్దు చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజలు చైతన్యవంతులయ్యారని, మరోసారి బీఆర్ఎస్‌ను బొంద పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పదేళ్లలో నిరుపేదల సంక్షేమం కోసం బీజేపీ ఏమీ చేయలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, నాయకులు దయాకర్‌రెడ్డి, దుంపల మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, లింబాద్రి, మైపాల్‌రెడ్డి, శ్రీరాం వెంకటేష్, జేపీ వెంకటిగౌడ్, భిక్కనూరు స్వర్ణకార సంఘం గౌరవ అధ్యక్షుడు నాగభూషణం, ఉపాధ్యక్షులు ప్రకాశం, కోశాధికారి నర్సింహాచారి, సలహాదారులు భిక్షపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న స్వర్ణకార సంఘం సభ్యులు

10న జిల్లాకు ప్రియాంక గాంధీ రాక

- ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 10న నిర్వహించే సభలో ప్రియాంక గాంధీ పాల్గొంటారని ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి విష్ణునాథ్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని ఆరోపించారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి ప్రధాని మోదీ నిరుద్యోగులను మోసం చేశారన్నారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలంటే ప్రతి ఒక్కరు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, జహీరాబాద్ ఎంపీగా సురేశ్ షెట్కార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్

ఆశలన్నీ కేసీఆర్‌పైనే!



రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్.. నేతల వలసలతో డీలా పడుతోంది. ముఖ్య నేతలూ కారు దిగుతుండడంతో శ్రేణుల్లో నిరాశాపూరిత వాతావరణం నెలకొంటోంది. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రపై ఆ పార్టీ నేతలు ఆశలు పెట్టుకున్నారు. యాత్రను విజయవంతం చేయడం ద్వారా శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు.

- నేడు నిజామాబాద్‌లో.. రేపు కామారెడ్డిలో బస్సు యాత్ర
- రోడ్ షోలకు ప్లాన్ చేసిన బీఆర్ఎస్ నేతలు
- భారీ జన సమీకరణతో శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం

సాక్షి, కామారెడ్డి : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఒకప్పుడు బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉండేది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత జరిగిన ఎన్నికలలో ఆ పార్టీ సత్తా చాటింది. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికలలో దాదాపు క్లీన్ స్వీప్ చేసింది. 2014 పార్లమెంట్ ఎన్నికలలో నిజామాబాద్, జహీరాబాద్ స్థానాలను కైవసం చేసుకుంది. 2019లో నిజామాబాద్‌ను కోల్పోయినా జహీరాబాద్‌లో మాత్రం గులాబీ జెండానే ఎగిరింది. 2023 అసెంబ్లీ ఎన్నికలతో పరిస్థితిలో మార్పు వచ్చింది. ఎన్నికల సమయంలోనే కొందరు నేతలు కారుదిగినా.. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయాక గయారాంలు ఎక్కువయ్యారు. పదవులు అనుభవించినవారూ పార్టీని వీడుతుండడంతో శ్రేణుల్లో అయోమయం నెలకొంది. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికల్లో గెలవడం ద్వారా సత్తా చాటాలని, పోయిన పట్టును తిరిగి సాధించుకోవాలని బీఆర్ఎస్ నాయకత్వం ఆరాటపడుతోంది. అయితే ప్రజల నుంచి అనుకున్న స్థాయిలో మద్దతు దొరకడం లేదు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. సోమవారం నిజామాబాద్‌లో, మంగళవారం కామారెడ్డిలో జరిగే కేసీఆర్ బస్సు యాత్ర, రోడ్‌షోలపై ఆ పార్టీ నేతలు బోలెడు ఆశలు పెట్టుకున్నారు. కేసీఆర్ రాకతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం వస్తుందని భావిస్తున్నారు.

బీబీ పాటిల్ టార్గెట్‌గా..

రెండుసార్లు కారు గుర్తుమీద పోటీ చేసి విజయం సాధించిన బీబీ పాటిల్.. బీజేపీ గూటికి చేరారు. దీంతో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రెండుసార్లు ఎంపీగా గెలిపించుకుంటే కష్టకాలంలో పార్టీని వీడివెళ్లడాన్ని బీఆర్ఎస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకత్వం బీబీ పాటిల్‌ను టార్గెట్‌గా చేసుకుని ఎన్నికల ప్రచారం నిర్వహిస్తోంది. మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిలతోపాటు మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ సింధేలు బీబీ పాటిల్‌పై ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారు. పదేళ్లపాటు ఎంపీగా ఉన్న పాటిల్ చేసిందేమీ లేదని, కన్నతల్లిలాంటి పార్టీకి ద్రోహం చేశాడని ఆరోపిస్తున్నారు. బీబీ పాటిల్ ఓటమే లక్ష్యంగా చెమటోడుస్తున్నారు.

జిల్లా రద్దు అంశంపై ఫోకస్..

కామారెడ్డి జిల్లా రద్దవుతుందన్న అంశంపై బీఆర్ఎస్ నేతలు ఫోకస్ చేస్తున్నారు. జిల్లాను రద్దు చేస్తే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. ఎన్నికల సమయంలో జిల్లా రద్దవుతుందన్న అంశాన్ని ఫోకస్ చేయడం ద్వారా జనం మద్దతు పొందడానికి బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. బస్సు యాత్రలో స్థానిక అంశాలపై కేసీఆర్‌తో మాట్లాడించడం ద్వారా శ్రేణుల్లో జోష్ తీసుకురావాలని ఆ పార్టీ నాయకత్వం యోచిస్తోంది.

జన సమీకరణకు కసరత్తు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్ర నిర్వహించనున్నారు. సోమవారం నిజామాబాద్‌లో నిర్వహించే రోడ్ షోలో ఆయన పాల్గొంటారు. మరుసటి రోజు మంగళవారం కామారెడ్డిలో బస్సు యాత్ర నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి బీఆర్ఎస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో జనాన్ని సమీకరించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే సమావేశాలు నిర్వహించి ఏ గ్రామం, ఏ పట్టణం నుంచి ఎంత మందిని తరలించాలన్న దానిపై నేతలకు టార్గెట్లు ఇచ్చారు. జన సమీకరణకు ఆయా గ్రామాలు, వార్డులకు ఇన్‌చార్జీలను నియమించారు. జిల్లా కేంద్రంలో భారీ జన సమీకరణతో క్యాడర్‌లో జోష్ తేవడంతో పాటు ఓటర్లలోనూ ఆలోచన తీసుకురావాలని బీఆర్ఎస్ నేతలు యత్నిస్తున్నారు.

అంతటా యజ్ఞ సహిత యోగా నిర్వహించాలి

- భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావు

కామారెడ్డి అర్బన్: అన్ని గ్రామాల్లో నిత్యం యజ్ఞ సహిత యోగా కార్యక్రమాలను నిర్వహించడాన్ని ప్రోత్సహించాలని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావు సూచించారు. జిల్లా యోగా భవన్‌లో ఆదివారం ద్విశత కుండీయ మహావేద యజ్ఞం నిర్వహించారు. జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. అనంతరం శ్రీధర్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేశం కోసం ఓటు వేయాలని సూచించారు. దీనిని బాబా రాందేవ్ పిలుపుగా భావించాలన్నారు. సహస్ర కుండీయ యజ్ఞం లక్ష్యంగా సంకల్పం చేయాలని యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రాంరెడ్డి, యోగాచార్యులు జి.అంజయ్య గుప్తా, కిషోర్, శ్రీమతి, యోగా అసోసియేషన్ ప్రతినిధులు బి.రఘుకుమార్, పి.అంజయ్య, అనిల్‌రెడ్డి, రామ ముని, రాజారెడ్డి, ఆర్యసమాజ్ ప్రతినిధులు సత్యమిత్ర ఆర్య, ఇప్పకాయల నర్సయ్య, అర్పపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లి(ఖుర్దు), లింగంపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జి తివారి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం పరిశీలించారు. వసతుల గురించి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని జక్సాని నాగన్నగారి మెట్ల బావిని సందర్శించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రఘునాథ్, తహసీల్దార్ నరేందర్, ఉపతహసీల్దార్ రాజేశ్వర్, బీఎల్వోలు,ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ ప్రధాని మోదీనే..



బాన్సువాడ : హ్యాట్రిక్ ప్రధాని మోదీయేనని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం బీర్కూర్ మండలంలో దామరంచ, అన్నారం గ్రామాలకు చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. బీజేపీ మండల అధ్యక్షులు నాగేళ్ల సాయికిరణ్, నాయకులు మక్కన్న, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రవీణ్ తదితరులున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: జిల్లా కబడ్డీ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నగరంలో ఓ హోటల్‌లో నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా, ఎలాంటి ఓటరు జాబితా బయటపెట్టకుండానే రహస్య సమావేశం నిర్వహించి ఎన్నుకున్నారు. ఏళ్ల తరబడిగా ఉన్నవారే పదవుల కోసం పాకులాడడంతోనే ఎన్నికలు నిర్వహించకుండానే రహస్యంగా సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా అంద్యాల లింగన్న, కార్యదర్శిగా గంగాధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సుబ్బారావు, శ్రావణ్‌రెడ్డి, బొబ్బిలి నర్సయ్య, హైదర్‌అలీ, గంగారెడ్డి, జాయింట్ కార్యదర్శులుగా రాజేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, మీసాల ప్రశాంత్, రాజేందర్, కోశాధికారిగా సురేందర్, 9 మంది ఈసీ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, క్రీడల అధికారి ముత్తెన్న, గాదరి సంజీవరెడ్డి వ్యవహరించారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్

- ఓటుహక్కు వినియోగించుకున్న 99 మంది వికలాంగులు



మద్నూర్‌లో హోం ఓటింగ్‌లో భాగంగా ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధురాలు

మద్నూర్(జుక్కల్) : ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్న వృద్ధులు, వికలాంగులు ఆదివారం చివరి రోజు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని జుక్కల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని వృద్ధులు, వికలాంగుల ఇంటి వద్దకు ఎన్నికల అధికారులు వెళ్లి ఓటు వేయించారు. నియోజకవర్గంలో మొత్తం 185 మందిలో 154 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహసీల్దార్ ముజీబ్ తెలిపారు. ఇందులో 55 మంది వృద్ధులు, 99 మంది వికలాంగులు ఇంటి వద్ద ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. 20 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ద్వారా 135 మంది ఉద్యోగులు ఓటు వేసినట్లు ఆయన చెప్పారు. ఆదివారం డోంగ్లీ తహసీల్దార్ రేణుక చౌహాన్, పోలీసు అధికారులు, ఇతర శాఖల ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈనెల 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ కొనసాగుతుందని వారు పేర్కొన్నారు.

లక్షకుపైగా మెజారిటీతో గెలుస్తాం..



మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్ : పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ లక్షకుపైగా మెజారిటీతో గెలుస్తారని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన పట్టణ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. జహీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీకి అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు చిత్తుగా ఓడటం ఖాయమన్నారు. కామారెడ్డిలో వ్యాపారులను అధికారులు ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తానని అన్నారు. ఇక మిగిలిన వారం రోజుల పాటు ప్రతీ కార్యకర్త బీజేపీ గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి మోదీ సర్కార్..

మాచారెడ్డి : కేంద్రంలో మరో సారి ప్రధాని నరేంద్ర మోడీ సర్కార్ కొలువు దీరనుందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం మాచారెడ్డి,పాల్వంచ మండల కేంద్రాల్లో వేర్వేరుగా జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వెంట నడుస్తున్నారని కాటిపల్లి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ మాట్లాడుతూ తనను మరోసారి ఆదరించి గెలిపిస్తే కామారెడ్డి నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ స్పష్టం చేశారు. మాచారెడ్డి, పాల్వంచ మండల శాఖ అధ్యక్షులు బూస సురేష్, పోసు అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నాల వెంకట్ రెడ్డి, ఓబీసీ అధ్యక్షుడు తోట బాల్ రాజు, నరసింహచారి, పుట్టకొక్కుల నర్సింలు రాజశేఖర్, హారిక ఉన్నారు.

ఎల్లారెడ్డి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌కు నోటీసులు?

తెయూ(డిచ్‌పల్లి) : వార్షిక అనుబంధ గుర్తింపు తనిఖీ సందర్భంగా సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైన ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ నుంచి తెలంగాణ యూనివర్సిటీ అధికారులు వివరణ కోరేందుకు సిద్ధం అయినట్లు సమాచారం. తెయూ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, పీజీ, బీఈడీ కళాశాలల గుర్తింపు తనిఖీలకు సంబంధించిన నోటిఫికేషన్ మార్చి 7న విడుదల చేశారు. తనిఖీల సందర్భంగా ఆయా కళాశాలలకు సంబంధించిన డాక్యుమెంట్‌లు, ల్యాబ్ పరికరాలు, లైబ్రరీ కోసం కొనుగోలు చేసిన పుస్తకాల బిల్లులు, సిబ్బంది వేతనాల చెల్లింపుల రికార్డులు సిద్ధంగా ఉంచాలని వర్సిటీ అధికారులు పలుమార్లు కాలేజీలకు సూచించారు.

సమాచారం ఇచ్చినా..

తనిఖీలు ఏప్రిల్ 25 నుంచి మొదలవుతాయని ఏప్రిల్ 2న మరోసారి వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలకు ఆడిట్ సెల్ అధికారులు సమాచారాన్ని అందించారు. శనివారం (మే 4న) ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ తనిఖీలకు వచ్చిన వర్సిటీ అధికారులకు అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది అసంపూర్తిగా సమాచారాన్ని ఇవ్వడంతో వారు అసహనానికి గురయ్యారు. తమకు శనివారం ఉదయం వరకు తనిఖీల సమాచారం లేదని, ప్రిన్సిపాల్ ఎలాంటి సమాచారం ఇవ్వలేదని సిబ్బంది చెప్పడంతో వర్సిటీ అధికారులు అవాక్కయ్యారు. అయితే అప్పటికప్పుడు కనీసం ఎవరికైన ఇన్‌చార్జి ఇవ్వాలని కోరినా ప్రిన్సిపాల్ నుంచి స్పందన కరువైంది. సుమారు రెండు గంటల తర్వాత ప్రిన్సిపాల్ చెప్పారని ఆడిట్ సెల్ డైరెక్టర్‌కు కాకుండా తనిఖీ బృందంలోని మరో అధికారికి కాలేజీ పార్ట్ టైం ఉద్యోగి లేఖ ఇవ్వగా ఆయన తిరస్కరించినట్లు తెలిసింది.

అధికారుల ఆగ్రహం

అడ్మిషన్ రిజిస్టర్ అసంపూర్తిగా ఉందని, లైబ్రేరియన్ అందుబాటులో లేదని, ఉన్న సిబ్బంది వర్సిటీ అధికారులు అడిగిన వాటికి సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తికి గురైనట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో ఆగ్రహం వ్యక్తం చేసిన వర్సిటీ అధికారులు ప్రిన్సిపాల్‌ను వివరణ కోరుతూ నోటీసు జారీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రిన్సిపాల్ వైఖరి ఎప్పుడూ ఇలాగే నిర్లక్ష్యంగా ఉంటుందని తనిఖీ బృందం సభ్యులు ఒకరు చెప్పారు. ప్రిన్సిపాల్ గైర్హాజరు, నిర్లక్ష్య వైఖరిపై కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.



ఎల్లారెడ్డి డిగ్రీ కళాశాల

జ్ఞాపకాల సమ్మేళనం



ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో..



పద్మశాలి ఉన్నత పాఠశాలలో..



తాడ్‌బిలోలి హైస్కూల్‌లో..



పొతంగల్ హైస్కూల్‌లో..



భిక్కనూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల (1991-92) బ్యాచ్ విద్యార్థులు

భిక్కనూరు/కమ్మర్‌పల్లి/వేల్పూర్/నిజామాబాద్ అర్బన్/రెంజల్/ రుద్రూర్: పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు చిన్ననాటి జ్ఞాపకాలకు వేదికలయ్యాయి. చిన్నానాటి మిత్రులు ఒకేచోట కలవడంతో ఆప్యాయంగా పలుకరించుకున్నారు. భిక్కనూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (1991–92) ఆదివారం పూర్వ విద్యార్థులు సమ్మేళనాలు నిర్వహించారు. కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో(1997–98), ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో(1998–99), నగరంలోని పద్మశాలి ఉన్నత పాఠశాలలో (1998–99), రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలి హైస్కూల్‌లో (2008–09), కోటగిరి ఉమ్మడి మండలంలోని పొతంగల్ హైస్కూల్‌లో (2006–07), తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.



హాసాకొత్తూర్‌లో..

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఆర్గొండ నాయకులు



కామారెడ్డి పట్టణంలో షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న పాతరాజంపేట్ నాయకులు

జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలో ఆదివారం వివిధ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు చేరారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

– రాజంపేట/కామారెడ్డి టౌన్/రామారెడ్డి/బాన్సువాడ/బాన్సువాడ రూరల్



పోచారం గ్రామంలో..



బాన్సువాడలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సిద్దాపూర్ మాజీ ఎంపీటీసీ కిషన్



ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న యూత్ అధ్యక్షుడు ప్రవీణ్

పొరపాట్లకు తావులేకుండా ఈవీఎంల కమిషనింగ్

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



ఆర్మూర్, బాల్కొండ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆర్మూర్, భీంగల్: ఎన్నికల్లో పోలింగ్ నిర్వహణకు చేపడుతున్న ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలని నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. నిజామాబాద్ పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఆర్మూర్, బాల్కొండ శాసనసభా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను కలెక్టర్ ఆదివారం సందర్శించారు. ఆర్మూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, భీంగల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్న కమిషనింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కాగా, ఆర్మూర్, భీంగల్ పట్టణాల్లో పోస్టల్ బ్యాలెట్ కోసం ఎంపీడీవో కార్యాలయాలు, విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను సైతం కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ ఉన్నారు.

చెట్టును ఢీకొని ఒకరి మృతి

సిరికొండ: చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని సర్పల్లి తండాలో శివారులో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం ఇందల్వాయి మండలం గౌరారం గ్రామానికి చెందిన సంపంగి మహేందర్(28)కు సర్పల్లి తండా పరిధిలోని వడ్డెర కాలనీకి చెందిన లతికతో వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో సిరికొండలో కుల సంఘంలో ఆదివారం ఇరువర్గాలు చర్చించుకుందామని నిర్ణయించారు. దీంతో మహేందర్ తన బైక్‌పై సిరికొండకు వస్తుండగా తండా సమీపంలో చెట్టును ఢీకొట్టాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్రైం కార్నర్

డెంగీతో ఒకరి మృతి



బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్‌కు చెందిన గాండ్ల రాజేశ్వర్(52) డెంగీ వ్యాధితో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబాయి వెళ్లిన రాజేశ్వర్ తీవ్ర జ్వరానికి గురి కావడంతో పది రోజుల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం వెళ్లగా వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెంగీ సోకినట్లు నిర్ధారించారు. దీంతో నాటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజేశ్వర్ శనివారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య



పిట్లం: భార్య కాపురానికి రావడం లేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కంభపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై నీరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంబదాస్(30)కు రెండేళ్ల క్రితం రజితతో వివాహమైంది. వీరికి ఏడాది బాబు ఉన్నాడు. డ్రైవర్‌గా పనిచేసే అంబదాస్ మద్యానికి అలవాటుపడి పని మానేశాడు. దీంతో ఇంట్లో గొడవలు కావడంతో మూడు నెలల క్రితం భార్య రజిత తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన అంబదాస్ ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సుభాష్‌గార్డెన్‌లో పర్యాటకులపై దాడి

- నలుగురికి గాయాలు





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లి శివారులో ఉన్న సుభాష్‌గార్డెన్‌లో ఆదివారం పర్యాటకులు, గార్డెన్ యాజమాన్యం మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు పర్యాటకులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన ఓ కుటుంబం సుభాష్‌గార్డెన్‌కు వెళ్లింది. సదరు కుటుంబంలోని యజమాని స్విమ్మింగ్‌పూల్‌కు ధరలు ఎక్కువగా ఉన్నాయని చెప్పడంతో గార్డెన్ నిర్వాహకులు, పర్యాటకుల మధ్య మాటామాట పెరిగి ఘర్షణ జరిగింది. దీంతో సుభాష్‌గార్డెన్‌కు చెందిన వ్యక్తులు ఇనుపరాడ్‌లతో దాడి చేయడంతో నలుగురు పర్యాటకులు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డవారిని చికిత్స జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా సుభాష్‌గార్డెన్ యజమాని బాధితులపైనే ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

కోనాపూర్‌లో అగ్ని ప్రమాదం

- డెయిరీ ఫాం దగ్ధం
- రూ. 5 లక్షల ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైన డెయిరీ ఫాం

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్‌లో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి రూ. 5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన మంగి హరీశ్ కొత్త చెరువు తండా రోడ్‌లో డెయిరీ ఫాం నడుపుతున్నాడు. ఫాంలో ఆరు ఆవులు, ఏడు బర్రెలు, ఐదు దూడలు ఉన్నాయి. ఫాంకు సమీపంలో ఉన్న వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో అవి డెయిరీ ఫాం వరకు వ్యాపించాయి. దీంతో ఫాంలోని గడ్డికట్టలతో పాటు పశువుల దాణాకు నిప్పు అంటుకుంది. సమాచారం అందుకున్న హరీశ్ అక్కడికి చేరుకొని పశువులకు కట్టిన తాళ్లను తొలగించి విడిచి పెట్టాడు. మంటలు చెలరేగి షెడ్డుకు అంటుకున్నాయి. మెట్‌పల్లి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పారు. అప్పటికే షెడ్డు కాలిపోవడంతో పాటు ఎండు గడ్డి కట్టలు, పశువుల దాణా, సామాగ్రి కాలి బూడిదైంది. సుమారు రూ. 5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

ఆర్మూర్‌లో బైక్ చోరీకి యత్నం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బైక్ చోరీకి యత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. పట్టణంలోని జంబిహనుమాన్ ఆవరణలో ఉన్న గంధ్రాలయం ఎదుట నిలిపి ఉంచిన పాతకుడి బైక్‌ను వేల్పూర్‌కు చెందిన శివ చోరీకి పాల్పడి పారిపోతుండగా స్థానికులు వెంబడించి పెర్కిట్ వద్ద పట్టుకున్నారు. అనంతరం దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు.

గడువు ముగిసిన కూల్ డ్రింక్స్ విక్రయం



రుద్రూర్: పొతంగల్ మండలం కల్లూర్‌లో గడువు ముగిసిన కూల్ డ్రింక్స్ విక్రయాలు కొనసాగుతున్నాయి. ఎండలు తీవ్రంగా ఉండడంతో కూల్ డ్రింక్స్ తాగడానికి వచ్చే వారికి వ్యాపారులు ఇదే అదునుగా భావించి అధిక ధరతో పాటు గడువు ముగిసిన కూల్‌డ్రింక్స్ విక్రయిస్తున్నారు. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రం నుంచి ఇద్దరు పని నిమిత్తం కల్లూర్‌కి రాగా ఓ షాపులో కూల్‌డ్రింక్ సేవించారు. తీరా బాటిల్‌పై ఫిబ్రవరికే గడువు ముగిసిన విషయాన్ని గమనించిన వారు యజమానిని ప్రశ్నించారు. సదరు యజమాని దురుసుగా వ్యవహరించినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గడువు ముగిసిన కూల్‌డ్రింక్ అమ్ముతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

అల్ప్రాజోలం పట్టివేత



మాట్లాడుతున్న సీఐ సంపత్, ఎస్సై సాయికుమార్

భిక్కనూరు: నిషేధిత మత్తు పదార్థమైన అల్ప్రాజోలంను రవాణా చేస్తూ పట్టుబడ్డ నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భిక్కనూరు సీఐ సంపత్, ఎస్సై సాయికుమార్ ఆదివారం తెలిపారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు పెద్దమల్లారెడ్డి గ్రామశివారులోని పెట్రోల్‌బంక్ సమీపంలో టీఎస్16 ఈడబ్ల్యూ 1970 గల కారును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేయగా వీరి నుంచి 248 గ్రాముల అల్ప్రాజోలం పట్టుకున్నారు. నాలుగు సెల్‌ఫోన్లు, రూ. 37,020 నగదు, కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అల్ప్రాజోలం సరఫరా చేస్తున్న నవీపేటకు చెందిన గొల్లపల్లి నరేశ్‌గౌడ్, గాంధారికి చెందిన భీమగొని దత్తాద్రిగౌడ్, మాక్లూర్‌కు చెందిన ఎల్లగొని సంతోష్‌గౌడ్, సంగం గ్రామానికి చెందిన కేసరి మల్లికార్జున్‌గౌడ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కామారెడ్డి కోర్టు న్యాయమూర్తి నలుగురికి 14 రోజుల రిమాండ్‌కు నిజామాబాద్ జిల్లా జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై-2 రాంచందర్ పాల్గొన్నారు.

కుర్నాపల్లిలో..

ఎడపల్లి: మండలంలోని కుర్నాపల్లిలో అల్ప్రాజోలంను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఇద్దరి వ్యక్తుల వద్ద సుమారు కిలో వరకు మత్తుపదార్థాలు ఉన్నట్లు సమాచారం అందడంతో అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడిలో ఒకరిని అదుపులోకి తీసుకోగా మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

మల్లారంలో నేరడిగొండవాసి హత్య

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని మల్లారం అటవీ ప్రాంతంలో నిర్మల్ జిల్లా నేరడిగొండవాసి హత్యకు గురయ్యాడు. ఆదివారం నేరడిగొండ పోలీసులు స్థానిక పోలీసుల సహాయంతో ఘటన జరిగిన స్థలానికి చేరుకోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 22న ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలానికి చెందిన గంగయ్య (35) ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సెల్‌ఫోన్ రికార్డులను పరిశీలించారు. మిస్సింగ్ అయిన తర్వాత చివరగా ఎవరితో మాట్లాడారో తెలుసుకొని నిజామాబాద్ నగరంలోని ఐదోటౌన్ పీఎస్ పరిధిలోని నివాసిని అదుపులోకి తీసుకొని విచారించారు.

అతడు నేరడిగొండ వాసి మల్లారం ప్రాంతంలో చనిపోయాడని తెలుపడంతో ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అక్కడ ఓ వ్యక్తిని కాల్చివేసిన ఆనవాళ్లు ఉన్నాయి. ఆత్మహత్య చేసుకోవడంతో కాల్చివేసినట్లు పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి తెలిపాడు. ఆత్మహత్య చేసుకుంటే ఎందుకు కాల్చివేయాల్సి వచ్చిందనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

నేరడిగొండ వాసికి నిజామాబాద్‌వాసికి సోషల్ మీడియాలోని ఓ ఆన్‌లైన్ యాప్ ద్వారా పరిచయం ఏర్పడింది. కాగా నేరడిగొండ వాసి హత్యకు పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని రూరల్ సీఐ సురేశ్ తెలిపారు.